సాక్షి
కర్నూలు
గురువారం । 1 । ఆగస్టు । 2024



గోరుకల్లులో 3.6 టీఎంసీల నీరు

పాణ్యం: గోరుకల్లు జలాశయంలో 3.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 9 వేల క్యూసెక్కులు వస్తుండగా బైపాస్‌కు 960 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



కామేశ్వరీదేవికి చీర, సారె

మహానంది: శ్రీకామేశ్వరీదేవికి బాలాజీ సేవా ట్రస్ట్, వేంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సుమారు 600 మంది మహిళలు చీర, సారె సమర్పించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,631.17
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 98.531
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,05,973
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,57,607

న్యూస్‌రీల్

తెలంగాణ సీఎంను కలసిన శ్రీమఠం పీఠాధిపతి



సీఎం రేవంత్ రెడ్డిని సన్మానిస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు రాఘవేంద్రుల జ్ఞాపిక, శేషవస్త్రం, ఫలపూల మంత్రాక్షింతలు అందజేసి ఆశీర్వదించారు. ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే రాఘవేంద్రస్వామి సప్తరాత్రోత్సవాలకు ఆయనను ఆహ్వానించారు. పీఠాధిపతి వెంట శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ నరసింహమూర్తి ఉన్నారు.

పంటల నమోదుకు ప్రత్యేక యాప్

కర్నూలు(అగ్రికల్చర్): ఈ-పంట డిజిటల్ క్రాప్ బుకింగ్ పేరుతో పంటల నమోదు చేయడానికి వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేసి, డౌన్‌లోడ్ చేసుకోవాలని రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలు జారీ చేసింది. ఖరీఫ్‌తో పా టు రబీ పంటల నమోదుకు కూడా షెడ్యూలు ను ఇచ్చింది. సెప్టెంబరు 15లోగా ఈ-కేవైసీ తో సహా ఖరీఫ్ పంటల నమోదు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. అదే నెల 19 నుంచి 24 వరకు పంటల నమోదుకు సంబంధించిన ము సాయిదా జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో సోషల్ అడిట్‌కు పెట్టడంతో పాటు గ్రామసభ నిర్వహించిజాబితాలను ప్రదర్శించాలి. అలాగే సెప్టెంబర్ 25 నుంచి 28 వరకు సోషల్ ఆడిట్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి 30న తుదిజాబితాలను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాల్సి ఉందని డీఏవో తెలిపారు. షెడ్యూలు ప్రకారం ఈ- పంట నమోదు ప్రక్రియ, సోషల్ అడిట్ తదితర వాటిని పూర్తి చేయడంపై దృష్టి సారించామని పేర్కొన్నారు.


తుంగభద్ర నదిలో తగ్గిన వరద ప్రవాహం

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిలో వరద నీటి ప్రవాహం తగ్గిపోయింది. బుధవారం ఉదయం 6 గంటలకు 63,471 క్యూసెక్కులు ఉండగా, సాయంత్రం 6 గంటలకు 16 వేల క్యుసెక్కులకు పడిపోయింది. ఎగువ రాష్ట్రాల్లో కురు స్తున్న భారీ వర్షాలతో తుంగభద్ర జలాశయం పూర్తి స్థాయిలో నిండుకుంది. దీంతో గత నెల 23న మొదటగా 3 గేట్లు పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఆ తరువాత 24న 10 గేట్లు, 25న 20 గేట్లు, అదే రోజు సాయంత్రం 28 క్రస్టు గేట్లు, 26న 33 గేట్లు పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆ రోజు నుంచి రోజు రోజుకు నీటి విడుదల పెరిగింది. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో తీరంలోని గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఒకే రోజు నీటి ప్రవాహం భారీగా తగ్గడంతో పంటల సాగుకు ఇబ్బందులు ఎదురవుతాయేమోనని నదీ తీర గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు.

దరఖాస్తు చేయకున్నా డెమోకు హాజరుకండి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో పార్ట్ టైం టీచర్ల ఎంపికకు దరఖాస్తు చేయని వారు కూడా నేరుగా ఈ నెల 1న (నేడు) నిర్వహించనున్న డెమోకు హాజరు కావాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు జూనియర్ లెక్చరర్స్, నాలుగు పీజీటీ, నాలుగు టీజీటీ పోస్టుల భర్తీకి జూలై 30వ తేది వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో పాటు దరఖాస్తు చేయని వారు కూడా సీ క్యాంప్ సమీపంలోని డీసీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న డెమోకు హాజరు కావాలని పేర్కొన్నారు.

డీఎంహెచ్‌ఓగా డాక్టర్ భాస్కర్



కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో)గా డాక్టర్ ఎల్.భాస్కర్‌ను నియమిస్తూ బుధవారం కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.పద్మావతి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ పదవీ విరమణ చేయడంతో ఈ పోస్టు ఖాళీగా మారింది. దీంతో ప్రస్తుతం జిల్లా ఎయిడ్స్, లెప్రసి, టీబీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎల్.భాస్కర్‌కు ఫుల్ అడిషనల్ చార్జి ఇస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు సాయంత్రం డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ నుంచి డాక్టర్ ఎల్.భాస్కర్ బాధ్యతలు తీసుకున్నారు.

కొందరికే 'బోగీ' భాగ్యం

- తిరుపతి – నిజాముద్దీన్ రైలులో జనరల్ ప్రయాణం నరకప్రాయం
- రెండే జనరల్ బోగీలు..కాలు పెట్టేందుకు కూడా స్థలం కరువు
- చార్జీలు తక్కువగా ఉండటంతో ఎక్కువ మంది ప్రయాణం
- డోన్, కర్నూలు, హైదరాబాద్ మీదుగా నిజాముద్దీన్ వెళ్తున్న రైలు
- జనరల్ బోగీలు పెంచాలని కోరుతున్న ప్రయాణికులు

సీట్ల కింద.. బాత్‌రూం సమీపాన.. తిరుగాడే ప్రదేశాల్లో ..ఖాళీ స్థలం అన్నది లేకుండా కిక్కిరిసిన ప్రయాణికులు.. కొందరు కూర్చొని, చాలా మంది నిల్చొని.. ఒకటి కాదు రెండు కాదు.. వందల కిలోమీటర్లు.. ఒంటి కాలిపై పంటిబిగువన ప్రయాణం.. మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు, దివ్యాంగుల అవస్థలు వర్ణనాతీతం. తిరుపతి నిజాముద్దీన్ వెళ్లే ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో రెండు జనరల్ బోగీల దుస్థితి ఇదీ.. బుధవారం కర్నూలు, డోన్ రైల్వే స్టేషన్లలో పరిస్థితులను 'సాక్షి' స్వయంగా పరిశీలించింది. ఆ వివరాలు...

కర్నూలు(సెంట్రల్): రైల్వేశాఖ కొంత కాలంగా వందేభారత్ రైళ్లను ప్రోత్సహిస్తోంది. ప్యాసింజర్, గరీబ్ రైళ్లను తగ్గిస్తూ వస్తోంది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు తమ ప్రయాణాల కోసం ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆశ్రయిస్తున్నారు. అందులోనూ జనరల్ బోగీలను తగ్గిస్తుండడంతో నరక యాతన అనుభవించాల్సి వస్తోంది. ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు కేవలం రెండు బోగీలు మాత్రమే జనరల్‌కు కేటాయించారు. వెనుక ఒకటి, ముందు భాగంలో మరొకటి ఉన్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్ తిరుపతి నుంచి నిజాముద్దీన్‌కు వెళ్తుంది. తిరుపతి నుంచి డోన్‌కు ఉదయం 10.30 గంటలకు చేరుకుంది. అక్కడికే పూర్తి రద్దీగా వచ్చింది. డోన్‌లో దాదాపు 45 నిమిషాలపాటు నిలువడంతో జనరల్ బోగీలను క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం వచ్చింది. నిలుచోవడానికి కూడా స్థలం లేదు. చిన్న పిల్లలు, మహిళలు ఒక్కో సీటులో ఇద్దరు సర్దుకొని కూర్చున్నారు. ఉక్కపోతతో చిన్నారులు ఏడుస్తూ కనిపించారు. బాత్‌రూం సమీపంలో కూడా కాలు తీసి కాలు పెట్టడానికి వీలు లేకుండా ఉంది. ఫుట్‌బోర్డుపై కూడా జనాలు ప్రమాదకర స్థితిలో కూర్చొని ప్రయాణిస్తున్నారు. డోన్ నుంచి ఈ రైలు కర్నూలుకు 12.05 గంటలకు చేరుకుంది. అయితే ఇక్కడ కూడా జనరల్ బోగీల్లో ఎక్కేందుకు ప్రయాణికులు గుమిగూడారు. ఒకరినొకరు తోసుకుంటూ ఎక్కారు. సీట్లు లేకపోవడంతో నిలుచోవాల్సి వచ్చింది. డోర్ల దగ్గర, బాత్ రూమ్ సమీపాల్లో కూర్చోవడానికి కూడా ఇబ్బంది పడుతుండగా రైలు కర్నూలు దాటి వెళ్లిపోయింది.



తోసుకుంటూ రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

పేదలకు తప్పని తిప్పలు

ఒకప్పుడు రైలు ప్రయాణమంటే పేదల పెన్నిధి. తక్కువ ఖర్చుతోఎక్కడికైనా ప్యాసింజర్ రైళ్లలో వెళ్లేవారు. అయితే కేంద్రప్రభుత్వం కరోనా సమయం నుంచి ప్యాసింజర్లు, గరీబ్ రైళ్లను తగ్గిస్తూ వస్తోంది. దీంతో పేదలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల్లో ప్రయాణించాల్సి వస్తోంది. గతంలో ఏ ఎక్స్‌ప్రెస్ రైలుకైనా నాలుగు జనరల్ బోగీలు ఉండేవి. అయితే రానురాను వాటి సంఖ్యను కూడా రెండుకు కుదించారు. మహిళలకు రిజర్వ్‌తోపాటు గార్డు కోసం ఒక అర్ధ బోగీ పోతుంది. ఈక్రమంలో రెండు బోగీలు ఉంటే ఒకటిన్నర బోగీ, మూడుబోగీలు ఉంటే రెండున్నర బోగీలు, నాలుగు బోగీలు ఉంటే మూడున్నర బోగీల్లోనే జనరల్ ప్రయాణికులు వెళ్లాల్సి వస్తోంది. మిగిలిన బోగీలన్నీ స్లీపర్, ఏసీల పేరుతో ధనిక వర్గాల ప్రజలు ప్రయాణించేందుకు వీలుగా ఉంటాయి.

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి

గుంతకల్లు నుంచి కాచిగూడకు ప్రతి రోజూ ప్యాసింజర్ రైలు నడిచేది. అదే సమయంలో కాచిగూడ నుంచి గుంతకల్లుకు మరో ప్యాసింజర్ రైలు వచ్చేది. ఈ ప్యాసింజర్ రైళ్ల ద్వారా వేలాది మంది హైదరాబాద్‌కు వెళ్లి వస్తుంటారు. అంతేకాక జిల్లాలోని మద్దికెర, తుగ్గలి, డోన్, వెల్దుర్తి, కర్నూలుకు సమీపంలోని వందలాది గ్రామాల ప్రజలు తమ ప్రయాణాలను కొనసాగిస్తుంటారు. అయితే ఈ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడంతో ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. దీంతో ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతకల్ – కాచిగూడ ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రయాణికులతో కిక్కిరిసిన జనరల్ బోగీ



ఫుట్‌బోర్డుపై కూర్చొని ప్రయాణం

ప్రతి రోజూ 8వేల మంది ప్రయాణం

కర్నూలు, డోన్, నంద్యాల మీదుగా ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, విజయవాడ, తిరుపతి తదితర నగరాలకు రైళ్లు వెళ్తుంటాయి. ఇందులో తుంగభద్ర, ఇంటర్‌సిటీ, ఏపీ సంపర్క్ క్రాంతి, కర్నాటక సంపర్క్‌క్రాంతి, ఓకా, హౌరా, నిజాముద్దీన్, చెన్నై సెంట్రల్, చెన్నై ఎగ్‌మోర్, బెంగళూరు, ఒంగోలు, గుంటూరు, హుబ్లీ, విజయవాడ, అమరావతి, భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌లు వెళ్తుంటాయి. కర్నూలు నుంచి అత్యధికంగా తిరుపతి, హైదరాబాద్‌కు వెళ్తుంటారు. బెంగళూరుకు వెళ్లే ప్రయాణికులు కూడా అధికంగా ఉంటారు. ఆయా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రతిరోజూ దాదాపు 8 వేలమంది వరకు ప్రయాణాలు చేస్తుంటారు. అయితే సీట్లు లేకపోవడంతో నిత్యం పాట్లు పడుతూ ప్రయాణాలు చేయాల్సి వస్తోందని, జనరల్ బోగీలను పెంచాలని పేదలు కోరుతున్నారు.

కాలు పెట్టేందుకు కూడా వీలు ఉండదు



నేను కర్నూలులోనే పుట్టాను. ఖాజీపేటలో అత్తారింటికి వెళ్తున్నా. ఎప్పుడు వచ్చినా రైలులో కాలు పెట్టేందుకు కూడా స్థలం ఉండదు. నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తోంది. జనరల్ బోగీలు రెండే ఉంటాయి. వాటిలో సీటు పట్టుకోవాలంటే చాలా కష్టం. చేతిలో బ్యాగులు ఉంటాయి. మాలాంటి వారి కోసం జనరల్ బోగీలను పెంచాలి

–ప్రవల్లిక

నరకం అనుభవించాల్సిందే



నేను హైదరాబాద్‌లో ఓ ప్రముఖ హోటల్‌లో పనిచేస్తా. కర్నూలు నుంచి హైదరాబాద్‌కు వెళ్తుంటా. నా సంపాదనకు స్లీపర్, ఏసీ కోచ్‌లలో వెళ్లలేను. ఎంత ఇబ్బంది ఉన్నా నా బడ్జెట్‌లో జనరల్ టిక్కెట్ కొనుగోలు చేసే ప్రయాణం చేయాల్సి వస్తోంది. కర్నూలు నుంచి హైదరాబాద్‌కు నాలుగు గంటలపాటు రైలు నడుస్తుంది. ఆ సమయంలో నరకం అనుభవించాల్సిందే. నేను ఏ నాడు కూడా కూర్చొని వెళ్లలేదు. బాత్ రూం దగ్గర కూడా కూర్చొని ప్రయాణం చేస్తుంటా.

–మహబూబ్‌ఖాన్, కర్నూలు

జనరల్ బోగీలు పెంచాలి



నేను పాలిస్ బండల కటింగ్ పనిచేస్తా. హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే నెల రోజులపాటు ఉంటా. మళ్లీ సొంతూరుకు రైలులో వస్తుంటా. రైలులో జనరల్ బోగీలో సీటు దొరకదు. నిలబడాల్సిందే. మహిళలు, చిన్నపిల్లల పరిస్థితి వర్ణనాతీతం. సందులో సడేమియగా అన్నట్లు దొంగలు కూడా వస్తుంటారు. జనరల్ బోగీలను పెంచితే మంచిది.

– డి.బాషావలీ, దేవనూరు

పోలీసు శాఖలో భారీగా బదిలీలు

- జిల్లాలో పలువురు డీఎస్పీలకు స్థానచలనం



పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
జె.బాబుప్రసాద్	దిశ మహిళా పీఎస్, కర్నూలు	ఎస్‌డీపీఓ, కర్నూలు
విజయశేఖర్	ఎస్‌డీపీఓ, కర్నూలు	పోలీస్ హెడ్ క్వాటర్స్
వై.శ్రీనివాస రెడ్డి	డోన్	పోలీస్ హెడ్ క్వాటర్స్
పి.శ్రీనివాసులు	సీఐడీ, కర్నూలు	డోన్
ఎం.భక్తవత్సలం	ఏపీఎస్పీ, కర్నూలు 2వ బెటాలియన్	ప్రొద్దుటూరు
షేక్ షరీఫుద్దీన్	ఆళ్లగడ్డ	ఏపీఎస్పీ2వబెటాలియన్, కర్నూలు
రవీంద్రనాథ్ రెడ్డి	నంద్యాల	పోలీస్ హెడ్ క్వాటర్స్
రవికుమార్	పీటీసీ, కడప	ఆళ్లగడ్డ
శ్రీనివాసాచారి	ఎస్‌డీపీఓ, తిరుమల	దిశ పీఎస్, కర్నూలు
లక్ష్మీనారాయణ	సీఐడీ, కర్నూలు	దర్శి

కర్నూలు: రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత మొదటిసారిగా పోలీసు శాఖలో భారీగా డీఎస్పీల బదిలీలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 96 మంది డీఎస్పీలకు స్థానచలనం కల్పిస్తూ ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా జిల్లాలో పలువురు డీఎస్పీలకు స్థానచలనం కలిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 8 పోలీస్ సబ్ డివిజన్లు ఉండగా కర్నూలు, డోన్, ఆళ్లగడ్డ, నంద్యాల, ఆత్మకూరు సబ్ డివిజన్‌ల అధికారులకు స్థానచలనం కలిగింది. ఆయా స్థానాలకు కొత్త డీఎస్పీలు నియమితులయ్యారు. అలాగే లూప్‌లైన్ విభాగాలైన దిశ మహిళా పీఎస్, ఏపీఎస్పీ కర్నూలు రెండవ బెటాలియన్, కర్నూలు సీఐడీ విభాగాల్లో పని చేస్తున్న డీఎస్పీలను బదిలీ చేసి ఆయా స్థానాల్లో కొత్తవారిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తిగా జి.ప్రతిభాదేవి



కర్నూలు(లీగల్): జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తిగా ప్రస్తుతం నాల్గవ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జి.ప్రతిభా దేవిని నియమిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో అదనపు జిల్లా జడ్జీలలో సీనియర్ న్యాయమూర్తి అయిన జి.ప్రతిభా దేవికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు చేపట్టారు. గురువారం నుంచి ఫ్యామిలీ కోర్టు జడ్జిగా, జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తిగా, మొదటి అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి జడ్జిగా వ్యవహరించనున్నారు.

ఉర్దూ వర్సిటీ రిజిస్ట్రార్‌గా లోకనాథ

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ లోకనాథ నియమితులయ్యారు. ఇక్కడ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు రిలీవ్ కావడంతో ఆయన స్థానంలో లోకనాథ వర్సిటీ ఎఫ్ఏసీ రిసిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఈయన కుప్పంలోని ద్రవిడన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం బాధ్యతలు తీసుకోనున్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

కర్నూలు సిటీ: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు గురువారం నోటిఫికేషన్ జారీ చేయాలని డీఈఓ కాగిత శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని స్కూళ్లలోని నోటీసు బోర్డుల్లో నోటిఫికేషన్‌ను ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఆయా స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల తల్లి/తండ్రి/సంరక్షకులను ఓటరు జాబితాలో చేర్చాలని, ఈ నెల 5న అభ్యంతరాలు సరిచేసి నోటీసు బోర్డులో ప్రదర్శించాలని తెలిపారు. 8వ తేదీ ఉదయం 7 మధ్యాహ్నం ఒంటి గంట మధ్యలో ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు ఎన్నికైన కమిటీ సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోవాలని సూచించారు. అదే రోజు కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించాలని, మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు కొత్త కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని తెలిపారు.

'పింఛన్' వంచన!

- కొత్త పింఛన్లపై ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6,916 పింఛన్ల కోత
- జూలై నెలలో పంపిణీ అభాసుపాలు
- ఆగస్టులోనూ ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం అనుమానమే!

కర్నూలు(అగ్రికల్చర్): తమను గెలిపిస్తే 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. అధికారంలో వచ్చిన తర్వాత కొత్త పింఛన్ల ఊసే ఎత్తడం లేదు. పైగా ఉన్న పింఛన్లకు కోత పెడుతున్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా పింఛన్ మొత్తాన్ని రూ.4,000 పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అలా గే 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికి వృద్ధాప్య పింఛన్ కింద రూ.4,000 చెల్లిస్తామని ప్రకటించారు. ప్రతి ఎన్నికల సభలోనూ దీనిని పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లారు. టీడీపీ అనుకూల మీడియా కూడా దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటై 50 రోజులు గడుస్తున్నా... కొత్త పింఛన్ల ఊసే లేకుండా పోయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 50 ఏళ్లు నిండి 60 ఏళ్ల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ. మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన వారు లక్ష మందికిపైగా ఉన్నారు. రేషన్ కార్డులు ఉండటంతో వీరందరూ పింఛన్ పొందేందుకు అర్హులే. అయితే వీరికి ఇప్పట్లో కొత్త పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా లేదు. ప్ర స్తుతం పింఛన్లు పొందుతున్న వారిలో అనర్హులు భారీగా ఉన్నారని, వారిని తీసేసిన తర్వాతనే.. ఆ స్థానంలోనే కొత్త పింఛన్లు ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ నెలలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4,70,116 పింఛన్లు ఉండగా.. ఆగస్టు నెలలో 4,63,200కు తగ్గాయి. మూడు నెలలో 6,916 పింఛన్లకు కోత పడింది.

వలంటీర్ వ్యవస్థకు మంగళం

వైఎస్సార్‌సీపీ హయాంలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఎటువంటి రిమార్కులకు తావివ్వకుండా పింఛన్లు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఓట్ల కోసం వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వేతనాలను రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత వలంటీర్ వ్యవస్థ ఊసే లేకుండా పోయింది. జూలై నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమం అభాసుపాలైంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలనే ఆదేశాలు ఉండగా.. ఇది అమలు కాలేదు. రచ్చబండ, ప్రధాన కూడళ్లు, సచివాలయాల్లో పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో ఆగస్టు నెల పింఛన్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయడం కూడా అనుమానమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఒక్క రోజే పంపిణీ

కర్నూలు జిల్లాలో 4,879 మంది, నంద్యాల జిల్లాలో 4,394 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. వీరంతా ఉమ్మడి జిల్లాలో 4,63,200 పింఛన్లను ఆగస్టు 1వ తేదీనే 100 శాతం పంపిణీ చేయాల్సి ఉంది. సాంకేతిక సమస్యల కారణంగా మిగిలిపోయిన పింఛన్లను మాత్రమే రెండో తేదీ పంపిణీ చేయాల్సి ఉంది. తగిన కారణాలు లేకుండా మరుసటి రోజు పంపిణీ చేస్తే వారిపై చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా.. గురువారం చేపట్టే పింఛన్ల పంపిణీపై జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.


కొత్త పింఛన్లు ఇవ్వాలి



టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తామని ప్రకటించారు. ఇది నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. నేను బీసీ సామాజిక వర్గానికి చెందిన పేద కుటుంబానికి చెందిన వాన్ని. నా వయస్సు ప్రస్తుతం 55 ఏళ్లు. వృద్ధాప్య పింఛన్‌కు అర్హత ఉంది. వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలి.

– హనుమన్న, అర్లబండ, కోసిగి మండలం

హామీ అమలు చేయాలి



ఎన్నికల సమయంలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ ఇస్తామ ని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ హామీని అమలు చేయడంపై దృష్టి సారించాలి. నేను మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన మహిళను. నాకు 56 ఏళ్ల వయస్సు ఉంది. రోజు పనికి వెళితేనే కుటుంబం గడిచేది. మాకు వృద్ధాప్య పింఛన్ పొందడానికి అర్హత ఉంది. చంద్రబాబు కొత్త పింఛన్లు ఇచ్చి మాలాంటి వారిని ఆదుకోవాలి.

– షేక్ కుషిద, డోన్, నంద్యాల జిల్లా



'సాగర్' చెంతకు వడివడిగా..

శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణమ్మ బిరబిరా నాగార్జున సాగర్ వైపు పరుగులు పెడుతోంది. మంగళవారం రాత్రి పది గేట్లను పది అడుగుల మేర తెరిచిన అధికారులు బుధవారం ఉదయం వరద ఉధృతి తగ్గడంతో రెండు గేట్లను మూసివేశారు. ఎనిమిది గేట్ల ద్వారా నాగార్జునసాగర్‌కు నీటి విడుదల కొనసాగుతోంది. విద్యుత్ ఉత్పాదన అనంతరం 60,020 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 1,89,250 క్యూసెక్కులు వెరసి.. 2,49,250 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు తరలి వెళ్తున్నాయి. ప్రస్తుతం జలాశయంలో 212.9 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యాం నీటిమట్టం 884.50 అడుగులకు చేరుకుంది.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



మౌనం వీడుమా.. స్వార్థం కనుమా!

ఇదీ బ్రాహ్మణకొట్కూరు సమీపంలోని హంద్రీనీవా కాలువ. రాయలసీమకు జీవనాడి. 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు 30లక్షల మంది గొంతులు తడుపుతోంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కాలువ టీడీపీ నేత నిర్లక్ష్యంతో 20 రోజులుగా నీరు పారకుండా కన్నీళ్లు మిగులుస్తోంది. ఇందుకు ఈ బుద్ధ విగ్రహమే మౌన సాక్షి. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక సీమలో ఎక్కడా చినుకు జాడ లేకుండాపోయింది. పంటలు ఎండిపోతుండగా.. కొన్నిచోట్ల తొలగించేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురిసిన వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. ఇప్పటికైనా శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులు నింపుకుంటే వ్యవసాయంతో పాటు తాగునీటి అవసరాలు తీర్చుకునే వీలుంటుందనే కనీస బాధ్యతను కూడా ప్రభుత్వం విస్మరించింది. రోడ్డు పనుల కాంట్రాక్టు దక్కించుకున్న టీడీపీ ఎమ్మెల్యే కాలువలో నీరు పారేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఏకంగా పూడ్చేయడం సీమకు శాపమవుతోంది.

– డి.హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

'ఓపెన్' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్)ద్వారా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదోతరగతి, ఇంటర్మీడియట్ తరగతుల్లో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కాగిత శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో ప్రవేశానికి 14 సంవత్సరాలు వయస్సు నిండిన వారు, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు 10వ తరగతి పాసై 15 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. www. apopenschool. ap. gov. in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

బ్రిడ్జిపై లారీ బోల్తా

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కల్వటాలలో ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జిపై బుధ వారం తెల్లవారుజామున సిమెంట్ లారీ బోల్తా పడటంతో డ్రైవర్ గాయపడ్డాడు. వైఎస్సార్ కడప జిల్లా దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ లోడ్‌తో లారీ బెంగళూరుకు బయలు దేరింది. మార్గమధ్యలో కల్వటాల వద్దకు రాగానే బ్రిడ్జిపై అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ వేల్ మురుగన్ గాయపడటంతో 108 సిబ్బంది చికిత్స కోసం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అశ్విని హాస్పిటల్ ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని జొహరాపురం రోడ్డులో నూతనంగా నిర్మించిన అశ్విని హాస్పిటల్‌ను బుధవారం మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఆయనతో పాటు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్యరంగంలో హైదరాబాద్ తర్వాత కర్నూలు నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. హాస్పిటల్ అధినేతలు, డాక్టర్లు సి.శ్రీనివాసరెడ్డి, ప్రమీలమ్మ, సురేష్ కుమార్‌రెడ్డి, దీపక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అత్యాధునిక పరికరాలు, ఐసీయూ, క్యాజువాలిటీ, సిటీ స్కాన్, ఇతర అత్యాధునిక వసతులు కల్పించినట్లు చెప్పారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ వైద్యులు డబ్ల్యూ సీతారాం, నరసింహులు, మాలకొండయ్య, తిరుపాల్‌రెడ్డి, కేజీ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, చిత్రంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, వైద్యులు

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి

ఉయ్యాలవాడ: మండలంలోని అల్లూరు గ్రామంలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న సుంకయ్య(45) బుధవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఏఈ గురుప్ప, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామంలో గంగమ్మ ఆలయం సమీపంలోని కుంటకట్ట వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎక్స్ ఫీజ్ వేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన సుంకయ్యను చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య పుల్లమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



సుంకయ్య(ఫైల్)

న్యాయవాదుల సహకారం మరువలేనిది

- జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు
- పదవీ విరమణ చేసిన జిల్లా జడ్జికి ఆత్మీయ వీడ్కోలు

కర్నూలు (లీగల్): తాను 34 సంవత్సరాలుగా న్యాయమూర్తిగా పనిచేశానని, అందులో కర్నూలు న్యాయవాదులు అందించిన సహకారం మరువలేనిదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం న్యాయవాద సంఘ కార్యాలయంలో న్యాయమూర్తికి పదవీ విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గతంలో ఆదోని అదనపు జిల్లా జడ్జిగా పనిచేశానని, చివరి దశలో జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా తన సర్వీసును కర్నూలులో చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తాను సివిల్ కేసులు ఎక్కువగా పరిష్కారం చేశానని, కర్నూలులో పనిచేసిన మధుర స్మృతులు మరువరానివన్నారు. న్యాయవాదులు వృత్తిని చాలెంజ్‌గా తీసుకుని, నూతన చట్టాలను ఆకళింపు చేసుకుని వృత్తి నైపుణ్యం పెంచుకోవాలన్నారు. సీనియర్ న్యాయవాదులు బి.మురళీ మనోహర్ జయరాజు, ఎం.ఎల్.శ్రీనివాస రెడ్డి, జోగయ్య శర్మ, నాగభూషణం నాయుడు, ఎం.ఆర్.కృష్ణ, ఎ.మాదన్న, దేవపాల్ తదితరులు మాట్లాడుతూ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా శ్రీనివాసరావు ఎంతో హుందాగా వ్యవహరించి జూనియర్ న్యాయవాదులను ఎంతో ప్రోత్సహించారని గుర్తు చేసుకున్నారు. అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొని ఆయన ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, బి.ఎస్.రవికాంత్ ప్రసాద్, మహిళా ప్రతినిధి సుమన రాణి, ఎస్.లక్ష్మణ్, సి.ప్రభాకర్‌రెడ్డి, రవి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన జిల్లా జడ్జిని సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న న్యాయవాదులు

న్యాయమూర్తులు..

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా 22 నెలలు పనిచేసి బుధవారం పదవీ విరమణ చేసిన ఎస్.శ్రీనివాసరావును జిల్లాలోని న్యాయమూర్తులు ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. బుధవారం రాత్రి 8 గంటలకు స్థానిక న్యాయ సేవా సదన్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. 34 సంవత్సరాల నుంచి న్యాయమూర్తిగా సేవలందించారని, చాలా మంచి గుణం ఉన్న వ్యక్తిగా పలువురు న్యాయమూర్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు జడ్జీలు జి.ప్రతిభా దేవి, జి.భూపాల్ రెడ్డి, పాండు రంగారెడ్డి, సబ్ జడ్జీలు మల్లీశ్వరి, దివాకర్, లీలా వెంకట శేషాద్రి, మెజిస్ట్రేట్స్ జోత్స్న దేవి, సరోజనమ్మ, వందన, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు దంపతులకు సన్మానం చేసిన న్యాయమూర్తులు

బాబూ.. సమస్యలపై శ్రద్ధ చూపు

- ఊసేలేని 'శ్రీశైల దేవస్థానం స్వయం ప్రతిపత్తి'
- టూరిజం హబ్‌గా ఈసారైనా అభివృద్ధి చెందేనా
- ధర్మకర్తల మండలి నియామకం ఎప్పుడో?
- నేడు శ్రీశైల మల్లన్నను దర్శించుకోనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- సౌకర్యాల మెరుగుకు కృషి చేయాలని భక్తుల డిమాండ్

ఏళ్లుగా తిష్టవేసిన ఉద్యోగులతో కుంటుపడిన శ్రీశైల ఆలయ అభివృద్ధి.. కాటేజీలు, వసతి గదులు, సత్రాలు, ఆశ్రమాల నిర్మాణాలకు అనుమతులు లేకపోవడంతో వసతులు లేక భక్తులు పడుతున్న ఇబ్బందులు.. ముఖద్వారం నుంచి టోల్‌గేట్ వరకు రోడ్డును వెడల్పు చేయకపోవడం, సాక్షి గణపతి ఆలయం వద్ద పార్కింగ్ లేకపోవడంతో వాహనదారుల అవస్థలు అన్నీఇన్నీ కావు. వీటన్నిటినీ పరిష్కరించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జలసిరికి హారతి కార్యక్రమం నిమిత్తం గురువారం శ్రీశైలం రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం డ్యాం వద్ద జలసిరికి హారతి కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం హాజరుకానున్నారు. ఈ సందర్భంగా భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైల ఆలయంలో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించాలని భక్తులు కోరుతున్నారు. దేశవ్యాప్తంగా వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, శ్రీశైల క్షేత్రాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

ఊసేలేని స్వయం ప్రతిపత్తి

శ్రీశైల క్షేత్రానికి రోజురోజుకు భక్తుల రాక గణనీయంగా పెరుగుతోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా క్షేత్రంలో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. రాష్ట్రంలో రెండో అతిపెద్ద పుణ్యక్షేత్రం కావడంతో శ్రీశైల క్షేత్రానికి తిరుమల తరహాలో స్వయం ప్రతిపత్తి కల్పించాల్సి ఉంది. తద్వారా ఆలయానికి ఐఏఎస్ అధికారి ఈఓగా ఉంటారు. బోర్డుకు స్వీయ నిర్ణయాలు ఉంటాయి కాబట్టి క్షేత్ర అభివృద్ధి వేగంగా జరిగే అవకాశం ఉంది. క్షేత్రానికి స్వయం ప్రతిపత్తి కల్పిస్తే ప్రభుత్వానికి కామన్ గుడ్ ఫండ్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆ ఫండ్‌ను భక్తుల అవసరాలకే వినియోగించుకోవచ్చు.

టూరిజం హబ్‌గా అభివృద్ధి చెందేనా?

శ్రీశైల క్షేత్ర అభివృద్ధిపై సీఎం హోదాలో చంద్రబాబు పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. అలాగే క్షేత్రాన్ని స్వయంగా చంద్రబాబు సీఎం హోదాలో సందర్శించినప్పుడు క్షేత్రాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కానీ ఆ దిశగా అడుగులు ముందుకు పడలేదు.



శ్రీశైల ఆలయం

ధర్మకర్తల మండలి ఎప్పుడు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలవుతున్నా ఇంకా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయలేదు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో భాగంగా శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి బోర్డు ఉంది. బోర్డులో చైర్మన్‌తో పాటు 14మంది సభ్యులు ఉంటారు. చైర్మన్, సభ్యులుగా సేవలందించేందుకు చాలా మంది ఆశావాహులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. మరి దేవస్థాన ధర్మకర్తల మండలశ్లెప్పుడు భర్తీ చేస్తారో.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా వసతి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. సామాన్యులు సైతం వసతి పొందేలా తక్కువ ధరకు వసతి గదులు అందుబాటులో ఉండేలా వసతి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. క్షేత్ర పర్యటనకు వచ్చిన భక్తులు రెండు రోజుల పాటు క్షేత్రంలోనే బస చేసి ఆధ్యాత్మిక అనుభూతి పొందేలా సౌకర్యాలు కల్పించాల్సి ఉంది.

శ్రీశైలంలో నెలకొన్న సమస్యల్లో కొన్ని..

- శ్రీశైల దేవస్థానంలో ఏళ్ల తరబడి ఇక్కడే విధులు నిర్వహిస్తుండడంతో అక్రమాలకు అవకాశం ఉంది. ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీ చేయాలి.
- సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర దేవస్థానాలకు బదిలీ అయిన ఉద్యోగులు డిప్యూటేషన్ పేరుతో శ్రీశైల దేవస్థానానికి చేరుకుని తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. డిప్యూటేషన్‌పై ఉన్న ఉద్యోగులను వారివారి దేవస్థానాలకు బదిలీ చేయాలి.
- శ్రీశైల దేవస్థానంలో దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకోసారి అన్ని విభాగాల ఉద్యోగులను అంతర్గత బదిలీ చేయాలి.
- రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు డయల్ యువర్ ఈఓ కార్యక్రమాన్ని నిర్వహించాలి.
- శ్రీశైలంలో కాటేజీలు, వసతి గదులు, సత్రాలు, ఆశ్రమాల నిర్మాణాలు చేసేందుకు ముందుకు వచ్చే వారికి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలి.
- శ్రీశైలం ముఖద్వారం నుంచి టోల్‌గేట్ వరకు రోడ్డును వెడల్పు చేయాల్సి ఉంది.
- సాక్షి గణపతి ఆలయం వద్ద పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- పాలధార–పంచధార వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

మనోడే.. పోస్టింగ్ ఇచ్చేయండి

- సీఐల బదిలీల్లో పైరవీలకు ప్రాధాన్యత

కర్నూలు: రకరకాల సిఫారసులు, భారీ పైరవీలతో కర్నూలు రేంజ్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లు పోస్టింగులు దక్కించుకున్నారు. వన్‌సైడ్‌గా పనిచేస్తామని చెప్పడమే కాకుండా పోస్టుకు తగినట్లుగా సమర్పించుకున్న వారికి కుర్చీలు దక్కాయన్న చర్చ జరుగుతోంది. కర్నూలు రేంజ్ పరిధిలో 35 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కల్పిస్తూ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 13 మందికి, నంద్యాల జిల్లాలో 9 మందికి కలిపి 22 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది.

రెడ్‌బుక్ స్క్రీనింగ్‌తో సీఐల జాబితా విడుదల

ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఎవరికి వారు తమ సీఐల జాబితాను రెడీ చేసి పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సమర్పించారు. అన్ని అర్హతలు పరిశీలించి వారం రోజుల క్రితమే జాబితా పోలీస్ హెడ్ క్వార్టర్‌కు చేరింది. అయితే తీవ్ర ప్రతిష్టంభన తర్వాత రెడ్ బుక్ స్క్రీనింగ్‌తో జాబితా విడుదలైనట్లు కొంతమంది పోలీసు అధికారులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. గత టీడీపీ ప్రభుత్వంతో సంబంధాలు ఉన్న వారికి ప్రజాప్రతినిధుల లేఖలు చాలా వరకు పనిచేశాయి. సమర్థులైన పోలీసు అధికారులు స్టేషన్‌లో ఉంటే శాంతిభద్రతల పరిరక్షణ సవ్యంగా సాగుతుందన్న విషయం పోలీసు ఉన్నతాధికారులకు తెలియనిదేమీ కాదు. అయితే అధికార పార్టీ అనుకూల సామాజిక వర్గానికి చెందిన కొందరు గ్రూపుగా ఏర్పడి రేంజ్ పరిధిలో పోస్టింగుల వ్యవహారంలో చక్రం తిప్పారనే చర్చ జరుగుతోంది. కర్నూలు పరిధిలో ఆరు పోలీస్ స్టేషన్లు ఉండగా కర్నూలు టూటౌన్‌కు సీసీఎస్‌లో ఉన్న జి.వి.నాగరాజరావును నియమించి అక్కడున్న సీఐ ఇంతియాజ్ బాషాను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే కర్నూలు ఎస్‌హెచ్‌ఆర్‌సీలో పనిచేస్తున్న బి.రామకృష్ణ కడప వన్‌టౌన్‌కు బదిలీ అయ్యారు.

భర్త హింస భరించలేక భార్య ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: భర్త పెట్టే చిత్ర హింసలు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బుధవారం సాయంత్రం కె. బసాపురం గ్రామంలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బోయ తిమ్మప్ప, యల్లమ్మలకు ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. చివరి కుమార్తె బోయ సుజాత(20)ను కొతాకోం మండలం కుప్పగల్ గ్రామానికి చెందిన చిన్న ఈరన్న, నాగలక్ష్మిల కుమారుడు బోయ తాయప్పకు ఇచ్చి ఏప్రిల్ 19న వివాహం జరిపించారు. తాయప్ప వేధింపులు తాళలేక మొదటి భార్య వదలి వెళ్లటంతో సుజాతతో రెండో పెళ్లి చేశారు. అయితే తాయప్పలో ఎటువంటి మార్పు రాలేదు. పెళ్లయినప్పటి నుంచి భార్యను కొట్టడం.. బ్లేడుతో కోయడం వంటి పనులు చేసేవాడు. ఈ విషయాన్ని సుజాత తల్లిదండ్రులకు చెప్పినా కొత్త కాపురం కదా సర్దుకుపోవాలని చెప్పేవారు. భర్త వేధింపులు ఎక్కువ కావడంతో ఆమె ఇరవై రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. రెండు రోజుల్లో తాయప్ప కుటుంబ సభ్యులు వచ్చి పంచాయితీ చేసి కుప్పగల్లుకు తీసుకుపోతారని చెప్పడంతో సుజాత భయాందోళనకు గురైంది. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఫ్యాన్‌కు వేలాడుతున్న సుజాతను చూసి బోరున విలపించారు. ఎమ్మిగనూరు రూరల్ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి అన్న నాగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



బోయ సుజాత (పెళ్లి నాటి ఫొటో)

'అధికారులను తన్ని పని చేయించుకోవాలి'

- టీడీపీ జెడ్పీటీసీ సభ్యుడి అనుచిత వ్యాఖ్యలు

ఆలూరు: అధికారులను తన్ని పని చేయించుకోవాలని పంచాయతీ కార్యదర్శితో టీడీపీకి చెందిన హాలహర్వి జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప అనుచిత వ్యాఖలు చేశారు. ఈ ఫోన్ సంభాషణ ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధానమంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలను పెడుతున్నారని, బీజేపీ నాయకులు పిలిస్తే తాను కూడా వెళ్లానని పంచాయతీ కార్యదర్శి చెప్పగా.. తనను పిలవకపోవడమేమిటని జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప ప్రశ్నించారు. ఈ సందర్భంలోనే 'చెప్పుతో కొడితే తప్ప మీరు మారరు' అంటూ వ్యాఖ్యానించారు. కాగా.. ప్రభుత్వ ఉద్యోగులపై నోరు పారేసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు లింగప్పపై పంచాయతీ కార్యదర్శి అధికారులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

పాఠశాల నీటి ట్యాంకులో ఉడుత కళేబరం

కొత్తపల్లి: మండలంలోని ముసలమడుగు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన తాగు నీటి ట్యాంకులో ఉడుత కళేబరం కనిపించింది. బుధవారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలోకి ఆడుకోవడానికి వెళ్లిన విద్యార్థులు.. ట్యాంక్‌లో ఉడుత మృతిచెంది పడి ఉండటాన్ని గమనించి గ్రామస్తులకు చెప్పారు. అవే నీటిని తాము కొంత కాలంగా తాగుతున్నామని విద్యార్థులు వాపోయారు. విద్యార్థులు తాగుతున్న నీటి విషయంలో అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడంతోనే ట్యాంక్‌లో ఉడుత ఎప్పుడు మృతి చెందిందో కూడా తెలియడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. కాగా ఇదే విషయాన్ని 'సాక్షి' హెచ్‌ఎం సుధాకర్ దృష్టికి తీసుకెళ్లగా.. తనకు రాత్రి 8 గంటలకు తెలిసిందని, సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లానని, ఉదయమే ట్యాంకును శుభ్రం చేయిస్తామని చెప్పారు.



పాఠశాల నీటి ట్యాంకులో మృతి చెందిన ఉడుత

30 మంది తహసీల్దార్లకు స్థానాల కేటాయింపు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లకు స్థానాలు కేటాయిస్తూ కలెక్టర్ పి.రంజిత్‌బాషా బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు.మొత్తం 30 మంది తహసీల్దార్లను 33 స్థానాలకు కేటాయించారు. అయితే చిప్పగిరి, తుగ్గలి మండలాలకు ఎవరినీ నియమించలేదు.అక్కడ డీటీలకు పూర్తి అదనపుబాధ్యతలు అప్పగించారు.కాగా,ప్రజాప్రతినిధుల సిఫారసులకు అనుగుణంగా పోస్టింగ్‌లు ఇచ్చినట్లు స్పష్టమవుతోంది.

తహసీల్దార్ పేరు	కేటాయించిన స్థానం
కె.రాజేశ్వరి	కలెక్టరేట్, ఏఓ
ఎస్.యోగేశ్వరిదేవి	సూపరింటెండెంట్ మెజిస్టీరియల్ సెక్షన్
ఏ.వెంకటేశ్వర్లు	సూపరింటెండెంట్, కోఆర్డినేషన్ సెక్షన్
ఏ.వేణుగోపాల్	సూపరింటెండెంట్, ల్యాండ్‌మ్యాటర్ సెక్షన్
ఏ.వేణుగోపాల్	స్పెషల్ తహసీల్దార్, కేఆర్ఆర్‌సీ, కలెక్టరేట్(ఇన్‌చార్జి)
ఐ.వేణుగోపాల్	స్పెషల్ తహసీల్దార్, కేఆర్ఆర్‌సీ, కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయం(ఇన్‌చార్జి)
ఏ.వెంకటేశ్వర్లు	ఏఓ, ఎల్ఆర్ కలెక్టరేట్(ఇన్‌చార్జి)
ఐ.వేణుగోపాల్	ఏఓ, ఆర్‌డీఓ కర్నూలు
టీవీ రమేష్‌బాబు	తహసీల్దార్, కర్నూలు రూరల్
కె.ఆంజనేయులు	తహసీల్దార్, కల్లూరు
డి.వెంకటేశ్ నాయక్	తహసీల్దార్,కోడుమూరు
ఐ.విజయశ్రీ	తహసీల్దార్, సి.బెళగల్
కె.రామంజనేయులు	తహసీల్దార్, గూడూరు
ఎస్.రామంజనమ్మ	తహసీల్దార్,కర్నూలు అర్బన్
ఎస్.వెంకటరమణ	తహసీల్దార్, ఓర్వకల్లు
సి.చంద్రశేఖర్ వర్మ	తహసీల్దార్, వెల్దుర్తి
కె.వసుంధర	ఏఓ, ఆర్డీఓ కార్యాలయం, ఆదోని
ఆర్.శివరాముడు	తహసీల్దార్, ఆదోని
ఎస్.శ్రీనాథ్	తహసీల్దార్,పెద్దకడబూరు
కె.మల్లికార్జునస్వామి	తహసీల్దార్, కౌతాళం
ఎస్.రవి	తహసీల్దార్, మంత్రాలయం
ఏ.నిత్యానందరాజులు	తహసీల్దార్, కోసిగి
ఏ.శేషఫణి	తహసీల్దార్, ఎమ్మిగనూరు
కె.శ్రీనివాసులు	తహసీల్దార్, నందవరం
కె.కుమారస్వామి	తహసీల్దార్, గోనెగొండ్ల
కె.సతీష్	ఏఓ,ఆర్‌డీఓ కార్యాలయం, పత్తికొండ
బి.జయన్న	తహసీల్దార్, దేవనకొండ
ఎస్.నజామబాను	తహసీల్దార్, హాలహర్వి
ఆర్.గోవిందుడు సింగు	తహసీల్దార్, ఆలూరు
జే.శివశంకర్‌నాయక్	తహసీల్దార్, ఆస్పరి
డి.చంద్రశేఖర్	తహసీల్దార్, కృష్ణగిరి
డి.హుస్సేన్‌సాహెబ్	తహసీల్దార్, మద్దికెర
ఈ.వెంకటలక్ష్మీ	తహసీల్దార్, పత్తికొండ